క్లుప్తంగా

ముధోల్ చేరిన పాదయాత్ర



స్వాగతం పలుకుతున్న నాయకులు

ముధోల్: నాందేడ్ జిల్లా కిన్వట్ తాలుకా మాదాపూర్ గ్రామ మహాశివాలయం నుంచి అదే గ్రామానికి చెందిన గంగేశ్వర్ మహారాజ్ బాసర అమ్మవారి ఆలయానికి చేపట్టిన పాదయాత్ర ఆదివారం సాయంత్రం ముధోల్ చేరింది. ఆయనకు గిరిజన నాయకులు రాథోడ్ నరేందర్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్ తదితరులు స్వాగతం పలికి సన్మానించారు. వారు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బస చేయగా.. మహరాజ్ వెంట వచ్చిన 300 మంది భక్తులకు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నదానం ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం బాసర బయలుదేరనున్నట్లు ఆయన తెలిపారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు

భైంసాటౌన్: తల్లిదండ్రులు, ఇతరులెవరైనా మైనర్లకు వాహనాలిస్తే.. వారిపై కేసులు నమోదు చేస్తామని అదనపు ఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. ఇటీవల పలువురు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడగా ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్‌తో వారితోపాటు ఇతర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ గోపినాథ్, ఎస్సైలు నవనీత్‌రెడ్డి, సుప్రియ తదితరులు ఉన్నారు.

మరాఠా సంఘం కార్యవర్గం ఎన్నిక

భైంసాటౌన్: మరాఠా పట్టణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక సంఘ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడిగా పుండ్లిక్ రావు, అధ్యక్షుడిగా మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా కాశీరాం పాటిల్, సంపత్ పాటిల్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్‌రావు పాటిల్, సహ కార్యదర్శిగా జాదవ్ సాయికృష్ణ, కోశాధికారిగా సిందే దర్శన్, ముఖ్య సలహాదారులుగా సునీల్ పాటిల్, జాదవ్ ఉత్తంరావు పాటిల్, సభ్యులుగా గణేశ్ పాటిల్, మోహన్‌రావు పాటిల్, దత్తురాం పాటిల్, సాయినాథ్ పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వీల్‌చైర్, స్ట్రెచర్ అందజేత

భైంసాటౌన్: పట్టణానికి చెందిన చిన్నారుల వైద్యనిపుణులు, ఆరుష్ ఆస్పత్రి వైద్యుడు బందెల నరేశ్ ఆధ్వర్యంలో భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రికి వీల్‌చైర్, స్ట్రెచర్ విరాళంగా అందజేశారు. ఈ మేరకు వారి కుటుంబసభ్యులు ఆదివారం ఆస్పత్రిలో అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, వైద్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న మిత్రులు

ఖానాపూర్: మండలంలోని సేవ్యా నాయక్ తండాకు చెందిన గుగ్లావత్ రాజేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ముధోల్ గురుకులంలో అతడితో కలిసి 2007–08లో పదోతరగతి చదివిన మిత్రులు అండగా నిలిచారు. ఆదివారం గ్రామానికి వెళ్లి రూ.50వేలను రాజేశ్ కుటుంబీకులకు సాయంగా అందించారు. కార్యక్రమంలో మిత్రులు నరేశ్, సాయన్న, ప్రవీణ్, ప్రశాంత్, రమేశ్, శివ తదితరులు ఉన్నారు.

కొండా లక్ష్మణ్‌కు నివాళి



కల్లూరులో పూలమాల వేస్తున్న సభ్యులు

కుంటాల: మండలంలోని కల్లూరులో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతిని పద్మశాలి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన మహనీయుడని పలువురు కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కన్వీనర్ గుద్దేటి గంగాధర్, కోశాధికారి సాయిరాం, సభ్యులు శివకుమార్, గట్టుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఎదురుచూపులు

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు అల్లంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురైంది. రాకపోకలకు గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గ్రామానికే చెందిన ముత్యాల గంగారెడ్డి సామాజిక మాధ్యమం అయిన ఎక్స్‌లో పోస్టు చేసి కలెక్టర్ అభిలాష అభినవ్‌ను ట్యాగ్ చేశారు. కలెక్టర్ స్పందించి వర్షాలు తగ్గాక రోడ్డు సమస్య పరిష్కరిస్తామని రిప్లై ఇచ్చారు.. కానీ నేటికీ రోడ్డు సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.





అల్లంపల్లి గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు

- ఉమ్మడి అల్లంపల్లి పరిధిలో రోడ్లు, ఆసుపత్రి కరువు
- తాగునీటికీ తప్పని కష్టాలు
- బీటీకి అటవీ అనుమతుల అడ్డంకి
- ఏళ్లుగా గోస పడుతున్న గ్రామాల ప్రజలు



ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

కడెం: మండలంలోని ఉమ్మడి అల్లంపల్లి గ్రామపంచాయతీ మండలకేంద్రానికి 42 కిలోమీటర్ల దూరంలో.. అభివృద్ధికి మాత్రం సుదూరంగా ఉంటోంది. 2500కు పైగా జనాభా ఉన్నా.. కనీసం తాగునీరు అందక సరైన రోడ్డు, ఆసుపత్రి లేక ఆయా గ్రామాల ప్రజలు గోస పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా విన్నవించుకుంటున్నా.. మా గోడు పట్టించుకునేవారే కరువయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

పదికి పైగా అనుబంధ గ్రామాలు..

ఉమ్మడి అల్లంపల్లి గ్రామపంచాయతీలో సుమారు పదికి పైగా అనుబంధ గ్రామాలుండగా.. పాలన సౌలభ్యం గత ప్రభుత్వం బాబానాయక్‌తండా ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసి కొన్ని గ్రామాలను చేర్చింది. ప్రస్తుతం అల్లంపల్లి, బాబానాయక్ తండా రెండు పంచాయతీల పరిధిలో గుర్రమాదిర, మీసాలభూమన్నగూడెం, గంగన్నపేట్, పాలరేగడి, చింతగూడ, కనిరాంతండా, అద్దాల తిమ్మాపూర్, మంగల్‌సింగ్‌తండా, గొండుగూడ, లంబడీతండా తదితర గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే ప్రధాన రహదారి(కడెం–ఉట్నూర్) నుంచి 11 కిలోమీటర్లు మట్టిరోడ్డుపై ప్రయాణించాలి. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగితే రాకపోకలు బందే. అత్యవసర వేళ వాగు దాటలేక ప్రాణాలు పోయిన ఘటనలెన్నో ఉన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారాయి.

ప్రధాన సమస్యలు..

- ప్రధాన రహదారి నుంచి అన్ని గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మించాలి.
- మండలకేంద్రానికి 42 కిలోమీటర్ల దూరం ఉన్నందున అల్లంపల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందుతాయి.
- అల్లంపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.
- మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ నల్లా నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి
- అద్దాల తిమ్మాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేయాలి.. త్రీఫేజ్ కరెంట్ అందించాలి
- గుర్రమాదిర, పాలరేగడి గ్రామాలకు వెళ్లే మార్గంలో వంతెన నిర్మించాలి.
- పాలరేగడిలో మిషన్ భగీరథ నీరందించే సోలార్ సిస్టంకు మరమ్మతులు చేయించాలి.
- గుర్రమాదిరలో పాఠశాల ఏర్పాటు చేయాలి.
- బాబానాయక్‌తండాలో ఫ్లోరైడ్ సమస్యలు అధిగమించేందుకు భగీరథ నీటిని సరఫరా చేయాలి. గ్రామంలో పాఠశాల భవనం నిర్మించాలి.
- గంగన్నపేట్, మంగల్‌సింగ్‌తండాలో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- గొండుగూడలో తాగునీటి సమస్య తీర్చాలి.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



మా గ్రామం నుంచి మండలకేంద్రానికి 42 కిలోమీటర్లు ప్రయాణించాలి. సకాలంలో వైద్యం అందక ఎందరి ప్రాణాలో గాల్లో కలిశాయి. అల్లంపల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు మేలు జరుగుతంది. – రంభదేవి, మాజీ సర్పంచ్, బాబానాయక్‌తండా

భగీరథ నీటిని అందించాలి



ఇప్పటికీ మా గ్రామానికి భగీరథ నీరు రావడం లేదు. నీటి కోసం బావుల వద్దకు వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, నాయకులు స్పందించి భగీరథ నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి. – యాశ్ల హన్మవ్వ, అల్లంపల్లి

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



మా గ్రామానికి ఖానాపూర్ మండలంలోని బీర్నంది సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుంది. లో వోల్టేజ్ సమస్యతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయి. గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే లోవోల్టేజ్ సమస్య తీరి విద్యుత్ సరఫరా అందుతుంది. – సంగ శ్రీనివాస్, అల్లంపల్లి మాజీ సర్పంచ్

దేశీదారు, గంజాయి విక్రయిస్తే జైలుకే

భైంసాటౌన్: నాటుసారా, దేశీదారు, గంజాయి విక్రయం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని భైంసా ఎక్సైజ్ సీఐ నజీర్ హుస్సేన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రఘురాం, నిర్మల్ జిల్లా ఎక్సైజ్ అధికారి రజాక్ ఆదేశాల మేరకు దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భైంసా స్టేషన్ పరిధిలో దేశీదారు, నాటుసారా తయారీ, విక్రయం, రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాల గురించి తెలిస్తే 87126 58790 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

‘డబుల్’ ఇళ్ల పనులు చేసి అప్పగించాలి



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

భైంసాటౌన్: పట్టణంలోని మహాగాం మార్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో విద్యుత్, తాగునీరు, సీవరేజ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఆదివారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం వద్ద వారు నిరసన తెలిపి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం పూర్తయినా సౌకర్యాల్లేవని లబ్ధిదారులకు కేటాయించలేదని పేర్కొన్నారు. ఇప్పుడు పనులు మంజూరైనా చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి జె.రాజు, తదితరులున్నారు.

చైతన్యయాత్ర జయప్రదం చేయాలి



పుష్పగిరిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఖానాపూర్: స్థానిక సంస్థల్లో జనాభా ప్రకారం విశ్వబ్రాహ్మణులకు రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ చైతన్యయాత్ర నియోజకవర్గ కన్వీనర్ దేశరాజి వెంకటేశ్ అన్నారు. విశ్వబ్రాహ్మణుల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్యం కోసం విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ అధినేత విశ్వనాథుల పుష్పగిరి ఈనెల 17న చేపట్టిన 1500 కిలోమీటర్ల చైతన్య పాదయాత్ర ఆదివారం ఖానాపూర్ చేరింది. ఖానాపూర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద యాత్రకు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సోమవారం ఖానా పూర్ మండలంలోని గ్రామాల మీదుగా యాత్ర జగిత్యాల జిల్లాకు చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కామోజి శ్రీనివాస్, అజయ్, భీమన్న, వెంకటరమణ, బల్యాల రమేశ్ తదితరులు ఉన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయాలి

ఖానాపూర్: ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వరకు పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, కార్యదర్శి నిమ్మల రమేశ్ కోరారు. ఆదివారం స్థానిక ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా వేంకటేశ్వర స్వామి వారి సేవ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 22 నుంచి 25 వరకు శాంతినగర్, శివాజీనగర్, సాయినగర్, శ్రీరాంనగర్, 26న శాంతినగర్, శివాజీనగర్, అంబేడ్కర్‌నగర్, 27న పద్మావతినగర్, టవర్స్‌కాలనీ, ఇంద్రానగర్, 28న శాంతినగర్, లారీ అడ్డా, 29న లారీ అడ్డా, విద్యానగర్, రాజీవ్‌నగర్, 30న శాంతినగర్, అక్టోబర్ 1న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రదక్షిణ, 2న శాంతినగర్, శివాజీనగర్, శ్రీరాంనగర్ మీదుగా గోదావరి తీరం వరకు ఊరేగింపు కొనసాగుతుందని పేర్కొన్నారు.

గ్రామాల్లో జోరు వర్షం



బోరిగాంలో వంతెన వద్ద దెబ్బతిన్న రోడ్డు

ముధోల్: ముధోల్‌తోపాటు ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, పంట చేన్లలో వరద చేరింది. చేతికి వచ్చిన సోయా పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బోరిగ్రాం గ్రామం మధ్యలో ఉన్న లోలెవల్ వంతెనపై వరద ప్రవహించడంతో వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది.

కడెం: మండలంలో ఆదివారం కురిసిన భారీవర్షానికి తీవ్ర ప్రజలు ఇబ్బంది పడ్డారు. గంగాపూర్, అల్లంపల్లి, ఇస్లాంపూర్, మిద్దెచింత తదితర గ్రామాలకు వెళ్లే దారిలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి

సీఆర్టీలకు వేతనాలు చెల్లించాలి

కడెం: గిరిజన పాఠశాలల్లో విధులు నిర్వర్తించే సీఆర్టీలకు పెండింగ్‌లో ఉన్న ఆరునెలల వేతనాలు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజేశ్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు హపవత్ రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వేతనాలు అందక సీఆర్టీలకు కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. వేతనాలు అందకుంటే దసరా, బతుకమ్మ పండుగలకు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న మహిళలు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం శీలమైత్రి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిలో పాస్టర్లు కార్తీక్, శకుంతల ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, ప్రేమానందం, పావుల్, బబ్లూ, సబిత ఉన్నారు.

దుర్గమ్మ చెంత రద్దీ

భైంసారూరల్: జాతీయ రహదారిని ఆనుకొని మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఎల్లమ్మ గుట్టపై చింతచెట్టులో స్వయంభుగా వెలసిన దుర్గమ్మ ప్రతిమ వద్ద భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం నుంచి వానల్‌పాడ్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఇప్పటికే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. చింతచెట్టు దుర్గమ్మను దర్శించుకునేందుకు మహారాష్ట్ర, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.

ప్రారంభమైన ఉత్సవాలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీగిరి నందిగుండం దుర్గామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి భవాని జెండా ఆవిష్కరించారు. ఆలయ వ్యవస్థాపకుడు కొండాజి వెంకటాచారి మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంటలకు వచ్చి భక్తులు మాలాధారణ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సాదం ఆనంద్, యాటకారి సాయన్న, ఆలయ పూజారి సందీప్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

తానూరు: మండలంలోని బెంబర క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఎల్వి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంటల వివరాలు నమోదు చేసేందుకు అధికారులు వస్తారన్నారు. రైతులు తమ పట్టాదారు పుస్తకాలదో పంటలు నమోదు చేసుకోవాలని కోరారు.

భామనుకుంటకు మరమ్మతులు



మరమ్మతు చేయిస్తున్న కపిల్


లోకేశ్వరం: ఇటీవలి వర్షాలకు లోకేశ్వరం సమీపంలో ఉన్న భామనుకుంట దెబ్బతినగా మండలకేంద్రానికి చెందిన దార్వడి కపిల్ అనే రైతు ముందుకొచ్చి ఆదివారం పొక్లెయిన్ సాయంతో మరమ్మతులు చేయించారు. కట్టపై పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి ఆయకట్టు కాలువల మరమ్మతులకు రూ.18వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల గంగాధర్, సవీన్, రాజు, భోజన్న ఉన్నారు.

ఎల్ఈడీ బల్బులు అమర్చేది ఎన్నడో..?



నర్సాపూర్(జి): మండలకేంద్రంలో పోలీస్‌స్టేషన్ నుంచి పెట్రోల్‌బంకు వరకు వెళ్లే మార్గంలో పంచాయతీ నిధులు రూ.53 లక్షలతో సెంట్రల్ లైటింగ్, మధ్యలో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు. కొన్ని నెలలుగా చాలా చోట్ల సెంట్రల్ లైటింగ్‌లోని సుమారు 20 వరకు ఎల్ఈడీ బల్బులు పనిచేయడం లేదు. దీంతో అంధకారం నెలకొని రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి పనిచేయని ఎల్ఈడీ బల్బుల స్థానంలో కొత్తవి అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పితృదేవతలకు పూజలు



బాసర: గోదావరి వద్ద చేస్తున్న పూజలు

బాసర: మహాలయ అమావాస్య పురస్కరించుకొని ఆదివారం బాసరలోని గోదావరి నది వద్ద భక్తులు పితృదేవతలకు పూజలు నిర్వహించారు. అర్చకుల సమక్షంలో తమ పూర్వీకులకు తర్పణాలు వది లి పిండ ప్రదానం చేశారు. వారి పేరిట దానధర్మాలు చేస్తే వంశాభివృద్ధి జరుగుతుందని అర్చకులు తెలిపారు.

కుంటాల: మహాలయ అమావాస్య పురస్కరించుకొని ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో పితృదేవతలకు పూజలు చేశారు. గతించిన వారిని దేవతలుగా భావించి పూజలు చేసి వాగుల్లో తర్పణం వదిలారు.

సిర్పెల్లిలో కర్ర దుర్గాదేవికి 13 ఏళ్లు

- మండపం వద్ద ప్రత్యేక పూజలు, నిత్యాన్నదానం



కర్ర దుర్గామాత

కుభీర్: దేవీశరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాధారణంగా మట్టితో అమ్మవారి ప్రతిమలను తయారుచేస్తారు. కానీ కుభీర్ మండలంలోని సిర్పెల్లిలో కర్రతో చేసిన దుర్గామాత 13 ఏళ్లుగా పూజలందుకుంటోంది. కర్ర దుర్గాదేవి ప్రతిమ ఎదుట మట్టితో చేసిన అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. దేవీశరన్నవరాత్రుల సందర్భంగా ఈ గ్రామంలో ఒకే ప్రతిమను ఏర్పాటు చేస్తారు. ఉత్సవాల వేళ గ్రామస్తులందరూ 10 రోజులపాటు భవానీదీక్ష స్వీకరిస్తారు. దీక్ష సమయంలో మద్యం, మాంసానికి దూరం ఉంటూ ఒకపూట మాత్రమే భోజనం చేస్తూ అమ్మవారిని స్మరించుకుంటారు. ఉత్సవాల అనంతరం వచ్చే నెల దసరా పండుగ మరుసటిరోజు మట్టి ప్రతిమను నిమజ్జనానికి తీసుకెళ్లి.. కర్ర విగ్రహంపై నీళ్లు చల్లి పెట్టెలో భద్రపరుస్తారు.

ప్రత్యేక పూజలు..

ఉత్సవాల వేళ రోజు పూజలు, హారతి తర్వాత దాతలు అన్నదానం చేస్తారు. ఇక్కడి అమ్మవారిని దర్శించుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. సమీప గ్రామాలైన పల్సి, పాంగర్‌పహాడ్, నిగ్వా, సోనారి, హంపోలి, గోడాపూర్, పార్డి(కె), కుభీర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి కర్ర దుర్గామాతను దర్శించుకుంటారు.

మూడు కిలోమీటర్లు.. 30 గుంతలు



కాళేశ్వరం కెనాల్ వద్ద..



కుంటాల సమీపంలో..

కుంటాల: మండలకేంద్రం నుంచి అంబకంటి వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డుపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో సుమారు 30కి పైగా గుంతలున్నాయి. ఎత్తువంపులు ఉండటంతో ప్రయాణికులు శారీరకంగా అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నామని.. మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక్కేసి.. పువ్వేసి.. చందమామ



ఆర్యవైశ్య సంఘం భవనం వద్ద మహిళలు

జిల్లాకేంద్రంలో ఆదివారం అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన ఆడబిడ్డలు గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి ఒక్కేసి.. పువ్వేసి.. చందమామ ఒక జాము అయే చందమామ అంటూ ఆడుతూ సందడిగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



గాయత్రి టౌన్‌షిప్‌లో..